జమ్మూకశ్మీర్ ఉగ్రదాడి

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రదాడిలో 28 మంది పర్యాటకులు మరణించిన విషాద ఘటనను పలువురు ప్రముఖులు తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

హేయమైన చర్య

జమ్మూ కాశ్మీర్లో ఉగ్రదాడి హేయమైన చర్య. ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి. అమాయక ప్రజలను చంపడం బాధాకరం. ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి సంఘటనలను పార్టీలకతీతంగా ఖండించాలి. చనిపోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి

-మాధవరం కృష్ణారావు,
ఎమ్మెల్యే, కూకట్‌పల్లి

ఉగ్రదాడి అమానుషం

జమ్మూకశ్మీర్‌లో ముష్కరుల కాల్పుల ఘటనను సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనలో హైదరాబాద్ వాసి మనీశ్‌రంజన్ ప్రాణాలు వదలడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలుపుతున్నాం. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు కేంద్రం ఆదుకోవాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. కశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించడంతో పాటు ఉగ్రచర్యలపై ఉక్కుపాదం మోపాలి.

-జాన్ వెస్లీ,
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

ఉక్కుపాదంతో అణిచివేయాలి

ఉగ్రవాదం సమాజానికి పెను సవాలు విసురుతోంది. జమ్ము కశ్మీర్‌లోని పహెల్‌గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలి. ప్రజాస్వామ్యంలో హింసను ఏ విధంగానూ సహించరాదు.పహెల్గాంలో అమాయకులైన పర్యాటకులను కాల్చి చంపడం తీవ్రంగా కలిచివేసింది. కశ్మీర్‌లో రక్తపుటేరులు పారించిన మూకలను కేంద్రం ఉక్కుపాదంతో అణచివేయాలి. పార్టీలకతీతంగా కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉంటుంది.

- గుత్తా సుఖేందర్‌రెడ్డి,
శాసనమండలి చైర్మన్

ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలి

కశ్మీర్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటనలో ఇండోర్ ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న సుశీల్ నతానియేల్‌తో సహా 26మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం కలిచివేసింది. బాధితకుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేస్తున్నాం. దేశంలో అశాంతికి కారణమైన ఉగ్రమూకలను మట్టుబెట్టాలి.

- రమేష్, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు

హెచ్ సిటీ పై నీలినీడలు

- భూసేకరణకు వెళ్లిన అధికారులకు చుక్కెదురు
- కేబీఆర్ పార్కు వద్ద న్యాయపరమైన చిక్కులు
- పాతనగరంలో టీడీఆర్‌లకు ససేమిరా అంటున్న బాధితులు
- ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ముందుకు సాగని ప్రక్రియ

పాతనగరంలో హెచ్ సిటీ ప్రాజెక్టు పనుల వివరాలు

పని	రహదారి విస్తరణ (వెడల్పు/మీటర్లలో)	ఆస్తుల స్వాధీనం
లక్కీస్టార్ హోటల్ నుంచి హఫీజ్ బాబా నగర్ (ఫుల్‌బాగ్)	12 / 18	138
చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్ నుంచి బార్కస్ రోడ్	24	68
తులసీ నగర్ నుంచి గౌస్ నగర్ వరకు	30	625
బెంగుళూరు హైవే నుంచి శాస్తిపురం జంక్షన్ వరకు	30	208
శాస్తిపురం జంక్షన్ నుంచి ఇంజిన్ బౌలి వరకు	30	352
సేకరించాల్సిన ఆస్తులు		1391

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రాజధాని నగరంలో ప్రధాన కూడళ్లు, మార్గాల్లో సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హెచ్ సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేబీఆర్ పార్కు చుట్టూ ప్రాజెక్టుపై న్యాయపరమైన చిక్కుల్లో ఉండడం, ఆగమేఘాల మీద టెండర్లు పిలిచిన అధికారులు భూ సేకరణపై స్పష్టత లేకపోవడంతో టెండర్ కమిటీ సైతం సంబంధిత టెండర్‌ను ఫైనల్ చేయలేక రోజుల తరబడి కాలయాపన చేస్తోంది. ఇదే సమయంలో పాతబస్తీలో హెచ్ సిటీ ప్రాజెక్టుల కింద పలుచోట్ల రహదారుల అభివృద్ధికిగానూ శ్రీకారం చుట్టింది. అయితే ఏడాది కాలంగా హెచ్ సిటీ ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. ప్రాజెక్టులో భాగంగా పలుచోట్ల భూ సేకరణ అధికారులకు సవాల్‌గా మారింది. 1,391 చోట్ల ఆస్తులను గుర్తించగా.. భూ సేకరణకు క్షేత్రస్థాయిలో వెళ్లిన అధికారులకు బాధితుల నుంచి చుక్కెదురు అవుతున్నది. చాలా వరకు చిన్న చిన్న ప్రాపర్టీలు పోతుండటంతో బాధితులంతా టీడీఆర్‌లకు ససేమిరా అంటున్నట్లు సమాచారం. నగదు రూపంలో నష్ట పరిహారం అందజేస్తేనే రహదారి విస్తరణ పనులకు సహకరిస్తామని తేల్చి చెబుతున్నారు. అసలే ఆర్థిక కష్టాల్లో మూలుగుతున్న బల్దియాకు ప్రభుత్వ నుంచి నిధులు మంజూరు జరగకపోవడం, ప్రాజెక్టు పనులు ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలో అని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. మొత్తంగా పాతబస్తీలో భూ సేకరణ కష్ట సాధ్యంగా మారడంతో హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు ఇప్పట్లో మొదలయ్యే పరిస్థితులు కనబడటం లేదని స్వయంగా ఇంజనీరింగ్ విభాగం అధికారులు పెదవి విరుస్తున్నారు. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతుండటంతో స్పెషల్ ఫండ్ కింద పాత నగరంలో భూ పరిహార బాధితులకు ప్రభుత్వం నుంచే నష్ట పరిహారం అందజేస్తూ వస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఆలస్యంగా వస్తుండటంతో ఆస్తుల సేకరణ సందిగ్ధంలో పడింది.

సీఎం కార్యాలయం ముట్టడిస్తాం

చాదర్‌ఘాట్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ఎదుట ఔట్‌సోర్స్ డ్రైవర్లు, లేబర్ల ఆందోళన

ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఔట్‌సోర్స్ డ్రైవర్లు, సిబ్బంది

మలక్ పేట, ఏప్రిల్ 23: తమ ఉద్యోగాలు తమకు ఇచ్చి తమ కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకోవాలని కోరుతూ జీహెచ్ఎంసీ ఔట్ సోర్స్ డ్రైవర్లు, లేబర్లు బుధవారం చాదర్‌ఘాట్ లోని జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఔట్‌సోర్స్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ.. జీజీహెచ్ఎంసీలోని వివిధ జోన్ల నుంచి కార్యాలయాల్లో పనిచేసే 814 మంది ఔట్ సోర్స్ డ్రైవర్లు, లేబర్లను ఏడాదిన్నర క్రితం ఉద్యానవనాలు, పార్కులు, సరస్సుల వద్ద రక్షణ కోసం డైరెక్టర్ పంపించారని ఆయన తెలిపారు. అందులో 120 మంది పరపతి కలిగిన ఔట్ సోర్స్ డ్రైవర్లు, లేబర్లు వారి పూర్వ స్థానాలకు బదిలీ చేయబడ్డారని, మిగిలిన 694 మంది ఏడాదిన్నర కాలం పాటు అక్కడే విధులు నిర్వహిస్తుండగా, వారిని తిరిగి పూర్వ స్థానాలకు బదిలీ చేశామని డైరెక్టరేట్ అధికారులు పంపించి వేశారు. దాంతో అక్కడి నుంచి వచ్చిన డ్రైవర్లు, లేబర్లు తమను విధుల్లోకి తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరగా, తమకు లిఖితపూర్వకంగా ఎలాంటి పత్రాలు అందలేదని, దాంతో తాము విధుల్లోకి తీసుకోలేమని, మీరు అక్కడే విధులు నిర్వహించాలని పంపించి వేశారని ఆయన తెలిపారు. అప్పటినుంచి తాము అటు కాకుండా ఇటు కాకుండా ఉద్యోగాలను, ఉపాధిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆయన తెలిపారు. నిరుపేద కార్మికుల కష్టాలను సర్కార్ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు తమ పరిస్థితులను అర్థం చేసుకొని, తమను పూర్వ స్థానాల్లోకి తీసుకొని తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో లేనిపక్షంలో తాము జీహెచ్ఎంసీ కార్యాలయం, ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయమ్మ, శ్రీశైలం, సునీల్, మహేష్, జానీ, ఔట్ సోర్స్ డ్రైవర్లు, లేబర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

మారుతిని అభినందిస్తున్న మహావీర్ కళాశాల సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 23: క్రమ శిక్షణ, పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని మహావీర్ గ్రూప్ ఆఫ్ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. కళాశాలలో బీటెక్ చదువుతున్న కొప్పుల మారుతి అండర్-23 అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో విద్యార్థిని అభినందించారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేపాల్‌లో మే 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో ఆల్ రౌండర్ కేటగిరిలో మారుతి ప్రాతినిధ్యం వహించనున్నడన్నారు. విద్యార్థికి కావాల్సిన అన్ని రవాణా, ఇతర ఖర్చులను కళాశాల స్పాన్సర్ చేస్తుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తాచాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ వి.ఉషశ్రీ, సీహెచ్ సైదులు, డాక్టర్ సరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలతో పాటు అక్రమాలు బయటకు..

ఎమ్మెల్యే కాలనీలోని ఖాళీ స్థలాల కబ్జా ● నిబంధనలకు విరుద్ధంగా క్రమబద్ధీకరణ

ఎమ్మెల్యే కాలనీలో ఆక్రమణలను కూలుస్తున్న రెవెన్యూ సిబ్బంది

బంజారాహిల్స్,ఏప్రిల్ 23: బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో 12 ఎకరాల ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ చేస్తున్న క్రమంలో పలు ఆక్రమణలు బయటపడుతున్నాయి. కొంతమంది తమ ఇండ్ల వెనకాల ఉన్న ఖాళీ స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి ప్రహరీలు, గార్డెన్లు ఏర్పాటు చేసుకున్నారు. మరికొంతమంది నిబంధనలను తుంగలో తొక్కి ఖాళీ స్థలాలను జీవో 59కింద క్రమబద్ధీకరించుకున్నట్లు షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఎమ్మెల్యే కాలనీగా పిలువబడే శ్రీ వెంకటేశ్వర హౌజ్ బిల్డింగ్ సొసైటీ పెద్దలు ఇష్టారాజ్యంగా లే అవుట్లను మార్చేసి ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలను ప్లాట్లుగా చూపించి అమ్ముకున్న సంగతి తెలిసిందే. గతంలో సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి హయాంలో పెద్ద సంఖ్యలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. అనంతరం సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికయిన సిద్దయ్య కూడా తానేమీ తీసిపోనన్న చందంగా కొన్ని స్థలాలను ప్లాట్లుగా అమ్మినట్లు న్యాయస్థానాల్లో కేసులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాలనీలోని ప్లాట్ నెం 37నుంచి ఏసీబీ కార్యాలయం దాకా లేన్‌లో సుమారు 20 నుంచి 25 ఇండ్ల యజమానులు తమ ఇంటి వెనకాల ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలంలోకి చొచ్చుకువెళ్లారని తేలింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పకడ్బందీగా ఫెన్సింగ్ పనులు చేయిస్తున్న షేక్‌పేట మండల అధికారులు స్థలంలోకి వచ్చిన ఆక్రమణలను చూసి షాక్‌కు గురవుతున్నారు. సుమారు 15మందికి పైగా ఇండ్ల వెనుకభాగంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని తేల్చారు. వీరిలో కొంతమంది తాము గతంలో జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయించుకున్నామని పత్రాలు చూపించారు. ఖాళీ స్థలాలను జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయడానికి వీలులేదు. ఆక్రమిత స్థలంలో సుమారు 70శాతం పైగా నిర్మాణాలు ఉంటేనే క్రమబద్ధీకరణ చేయాల్సి ఉంటుంది. కాగా ఎమ్మెల్యే కాలనీలో జీవో 59 కింద జరిగిన క్రమబద్ధీకరణలో నిబంధనలకు తూట్లు పొడిచినట్లు తేలింది. సర్వెంట్ రూమ్స్ గార్డెన్, ప్లే ఏరియాతో పాటు కొన్ని ఇండ్ల వెనకాల ఉన్న ఖాళీ స్థలాలను కూడా స్థానిక రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరించినట్లు తెలుస్తోంది. సుమారు ఎకరం స్థలానికి పైగా స్థలంలో ఆక్రమణలు ఉన్నాయని గుర్తించిన షేక్‌పేట మండల అధికారులు కొన్నింటిని కూల్చేయగా, మరికొన్ని ఆక్రమణలపై నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేపట్టి అక్రమంగా జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయించుకున్న ఖాళీ స్థలాలను.. ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఎమ్మెల్యే కాలనీలోని శ్రీ వెంకటేశ్వర హౌజ్ బిల్డింగ్ సొసైటీలో చోటు చేసుకున్న అవకతవకలపై గతంలోనే విజిలెన్స్ విచారణ జరిగింది. కాగా తాజాగా వెలుగులోకి వచ్చిన ఆక్రమణలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

ఏఐతో మెరుగైన వైద్య సేవలు

సిటీ బ్యూరో, ఏప్రిల్ 23, (నమస్తే తెలంగాణ): ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని సూపరింటెండెంట్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన అకాడమిక్ కార్యక్రమంలో అమెరికాకి చెందిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం వక్తలు పాల్గొని మాట్లాడారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డా. మాధ్యూ స్టెహ్లోవ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా, కృత్రిమ మేధస్సును ఉపయోగించి ఆరోగ్య సేవలను మరింత ఖచ్చితంగా, సమర్థవంతంగా అందించడం అనే అంశంపై ప్రసంగించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డా.,పీటర్ ఆకర్, ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.రాకేష్ సహాయ్, ఆర్ఎంఓలు డా.జయకృష్ణ, డా. శంకర్, డా.జాఫర్, డా.విజయ్ భాస్కర్ నర్సింగ్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం 5వ రోజుకు చేరింది. ఓయాలో జరిగిన అక్రమ అరెస్టులకు నిరసనగా కాంట్రాక్టు అధ్యాపకులు ఛలో ఉస్మానియా పిలుపునివ్వగా..రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉస్మానియా యూనివర్సిటీకి తరలిపచ్చారు. వారు ఆర్ట్స్ కళాశాల నుంచి ఓయా పరిపాలన భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, పీపోడబ్ల్యూ సంధ్య, , రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి తదితరులు వారికి సంఘీభావం తెలిపారు.

నిబంధనలు పాటించని దుకాణాల లైసెన్స్ రద్దు

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ: ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోన్న ఫుడ్, ప్యాకింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ల(దుకాణాలు)పై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం మోపుతోంది. ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. బుధవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని చెంగిచర్లలో ఎస్ఆర్ ఎంటర్ ప్రైజెస్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. తయారీ ప్రాంతంలో నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉందని, ట్యాంక్ సమీపంలో బల్లుల సంచారం ఉన్నట్లు గుర్తించారు. బోడుప్పల్‌లోని శ్రీ సాయి గణేశ్ ఎంటర్ ప్రైజెస్ (బొల్లిగూడెం)లో డ్రింకింగ్ వాటర్ అండ్ మిల్క్ ప్రొడక్ట్ తయారీ కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. రెండు లీటర్ల కెన్నే బ్రాండ్ సీసాలు గడువు ముగిసినట్లు గుర్తించారు. లేబుల్స్ సరిగా లేని 31 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పాల ఉత్పత్తుల తయారీ ప్రాంతం అపరిశుభ్రంగా ఉందని గుర్తించారు. సరుకులు రవాణా చేసే వాహనాలకు పత్రాలు సరిగా లేవని తేల్చారు. అజ్మీర్ ఖలాకన్ 38 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేసినటు ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రకటించారు. దుకాణాలపై దాడులు కొనసాగుతాయన్నారు.

వాటర్ బాటిల్స్ తయారీ కంపెనీలో తనిఖీలు చేస్తున్న అధికారులు

బంగ్లాదేశ్ యువకుడికి బర్త్ సర్టిఫికెట్

నార్సింగిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్.. ఇద్దరు అదుపులోకి..

మణికొండ, ఏప్రిల్ 23 : బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలసొచ్చిన ఓ యువకుడికి నార్సింగి మున్సిపాలిటీ నుంచి బర్త్ సర్టిఫికెట్ జారీ అయిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రంగంలోకి దిగారు. నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో సుధీర్ అనే వ్యక్తి ఆరేండ్లుగా ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. అధికారులు అతడికి జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసే బాధ్యతను అప్పగించారు. దీనిని అదునుగా భావించిన సుధీర్.. బంగ్లాదేశ్ యువకుడు నార్సింగిలో జన్మించిన వ్యక్తిగా జనన ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశాడు. సుమారు రెండేండ్ల కిందట ఈ పత్రం తీసుకున్న బంగ్లాదేశ్ యువకుడు.. ఇటీవల పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. పోలీస్ వెరిఫికేషన్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ పోలీసులు సుధీర్‌తోపాటు సదరు బంగ్లాదేశీయుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సుధీర్ రెండేండ్ల కిందట ఒకరికి అప్పటి కమిషనర్ సత్యబాబు డిజిటల్ సంతకంతో జనన ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసినట్టు తెలిసింది. అది నకిలీదని, దానిపైనా విచారిస్తున్నామన్నారు. అతను చేసిన అక్రమాలన్నింటినీ వెలుగులోకి తేవాలని, విచారణకు పూర్తి స్థాయిలో సహకరించాలని మున్సిపాలిటీ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డిని పోలీసులు కోరారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల విచారణలు

నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాలకు చెందిన కొంతమంది యువకులు అక్రమ దారిలో వచ్చి ఇక్కడ స్థిరపడినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిసింది. అయితే బంగ్లాదేశ్ నుంచి వచ్చిన యువకుడికి అక్రమ దారిలో మున్సిపాలిటీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి సుధీర్ అప్పటి కమిషనర్ సత్యబాబుతో కలిసి రూ. 10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని ఈ సర్టిఫికెట్‌ను జారీ చేసినట్లు తెలిసింది. ఇతడితోపాటు మరికొంత మంది విదేశీయులకు సర్టిఫికెట్లు, డూప్లికేట్ పత్రాలనూ అందించినట్లు సమాచారం. ఒక నార్సింగ్ మున్సిపాలిటీలోనే దాదాపు 20 మంది ఇతర దేశాల(బంగ్లాదేశ్, పాకిస్థాన్) నుంచి వచ్చి తప్పుడు పత్రాలతో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నట్లు తెలిసింది. వీరిపైనా టాస్క్‌ఫోర్స్ పోలీసులు లోతైన విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, బంగ్లాదేశ్ వాసి బర్త్ సర్టిఫికెట్ జారీ చేసిన విషయంలో లోతైన విచారణ చేపట్టిన టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరంతా నార్సింగి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు.

ఎమ్మెల్సీ పోలింగ్ @ 78.57%

బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలిస్తున్న సిబ్బంది

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించగా, మధ్యాహ్నం రెండు గంటల వరకే 78.57 శాతం ఓట్లు పోల్ అయ్యాయని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్లు 112 మందిలో 88 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 31 మంది ఎక్స్‌అఫిషియో మెంబర్లలో 22 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 81 మంది కార్పొరేటర్లలో 65 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 37.51 శాతం, మధ్యాహ్నం 12 గంటల వరకు 77.68శాతం, మధ్యాహ్నం రెండు గంటల వరకు 78.57శాతం, సాయంత్రం నాలుగు గంటల వరకు 78.57శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్.. రిటర్నింగ్ అధికారితో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను రిసెప్షన్ సెంటర్‌కు బందోబస్తుతో తీసుకువచ్చిన అనంతరం పరిశీలన చేసిన తర్వాత స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నెల 25న ఉదయం 8 గంటలకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఓట్ల లెక్కింపు ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా ఎన్నికల బరిలో ఎంఐఎం పార్టీ నుంచి మీర్జా రియాజ్ ఉల్ హసన్, బీజేపీ నుంచి డాక్టర్ ఎన్ గౌతంరావు నిలవగా.. ఎన్నికకు బీఆర్ఎస్ పార్టీ దూరంగా ఉంటున్నట్లు ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలుపొంది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్, డిప్యూటీ మేయర్, ఇతర కార్పొరేటర్లు ఎంఐఎం పార్టీ అభ్యర్థి తరపున ఓటింగ్‌లో పాల్గొనడం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.

గ్రేడింగ్ వ్యవస్థను కొనసాగించాలి

తెలంగాణ రిక్గ్నైజ్డ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్

వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

హిమాయత్ నగర్, ఏప్రిల్ 23: పదోతరగతి విద్యార్థుల మూల్యాంకన విధానంలో ప్రభుత్వం ఏకపక్షంగా చేపట్టిన మార్పుల దృష్ట్యా వారికి ఇంటర్నల్ మార్కులు, జీపీఏ గ్రేడింగ్ వ్యవస్థను తిరిగి యధావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కె. కృష్ణా రావుకు బుధవారం తెలంగాణ రిక్గ్నై జ్డ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేశారు. జీపీఏ గ్రేడింగ్ విధానం విద్యార్థులకు ఒత్తిడిని తగ్గించేందుకు ఎంతో సహాయ పడిందని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా చేసిన మార్పుల వల్ల విద్యార్థులపై ఒత్తిడి పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. అనిల్ కుమార్ కోశాధికారి కె.శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్ .. 1275 కేసులు

సిటీబ్యూరో: హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్‌లో నగర వ్యాప్తంగా 1275 కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. సిటీలో ఈనెల 5నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, పలుచోట్ల మైనర్లు వాహనాలు నడుపుతుంటే పట్టుకుని సెక్షన్ 199ఏ, మోటార్‌వెహికల్ యాక్ట్ 1988 ప్రకారం కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ వాహనాల్లో తాము రవాణాశాఖ అధికార